ఉపాధి కూలీలకు వేసవి భత్యమేది?

కేంద్ర ప్రభుత్వం వేసవి భత్యం నిలిపేయడంతో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల్లో ఆందోళన నెలకొంది. మండుటెండలో పని చేసే వారికి స్వాంతన కలిగించేలా మొదటి నుంచి ఉన్న వెసులుబాటును ఆపేయడంతో ఇబ్బందులు తప్పడం లేదని కూలీలు వాపోతున్నారు..

- మూడేళ్లుగా ఆపేయడంతో ఇబ్బందులు
- పని ప్రదేశాల్లో కనిపించని సౌకర్యాలు
- ఎండలోనే పనులు.. సకాలంలో అందని కూలీ డబ్బులు
- వంద రోజుల పని కొందరికేనా..



ఉపాధి పథకంలో పనులు చేస్తున్న కూలీలు

వట్‌పల్లి(అందోల్): గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు రానురాను ప్రోత్సాహం కరువవుతోంది. అధిక ఉష్ణోగ్రతల్లో పని చేస్తున్న కూలీలకు ఏటా వేసవి భత్యం, ఇతర వసతులు కల్పించేవారు. కానీ మూడేళ్లుగా అది ఆగిపోయింది. పని ప్రదేశాల్లో కూలీలకు టెంట్లు, తాగునీరు, పరికరాలు, ఇతర వైద్య సదుపాయాలు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధికూలీలతో పాటు సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

నీడలేదు..వైద్యం జాడలేదు..

ఉపాధి కూలీలకు కనీస సదుపాయాలు కల్పించడం లేదు. 2007లో కూలీలకు గడ్డపారలు ఇచ్చారు. ఆ తర్వాత ఇప్పటి వరకు ఎలాంటి పరికరాలు.. సదుపాయాలూ లేవు. వీటికి బదులు కూలి సొంతంగా గడ్డపార సమకూర్చుకుంటే రోజుకు రూ.10లు వేతనంలో కలిపేవారు. తాగునీటికి మరో రూ.5లు ఇచ్చేవారు. అయితే, కూలీల వేతనాలు రెండేళ్ల నుంచి రాష్ట్రంలో కేంద్ర సర్వర్‌కు అనుసంధానం చేయడంతో అసలు సమస్య మొదలైంది. అప్పటి నుంచి కూలీలకు సదుపాయాలు కల్పించలేకపోగా, వాటికి బదులు ఇచ్చే డబ్బులు కూడా అందించని పరిస్థితి.

నిలిచిన వేసవి భత్యం..

ఉపాధిహామీ పథకం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండగా కూలీ ఎక్కువగా వచ్చేది. దీనికి తోడు కూలీలు చేసిన పనుల్లో 25 నుంచి 30 శాతం వరకు 5 నెలల పాటు వేసవి భత్యం కేంద్రం చెల్లించేది. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం అదనంగా ఇచ్చేవారు. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఆప్షన్ తొలగించారు.

వేసవిభత్యంపై ఆలోచించాలి



వేసవి భత్యాన్ని దృష్టిలో ఉంచుకొని మండుటెండల్లో ఉపాధి పనులకు వచ్చే వాళ్లం. ఆ సీజన్ మొత్తంలో వచ్చే అదనపు భత్యమై మాకు మరింత ఆసరాగా నిలిచేది. మూడేళ్లుగా నిలిపివేయడంతో అదనపు ఉపాధి దొరకడం లేదు. డీఆర్డీఏ అధికారులు చొరవ తీసుకొని వేసవి భత్యం చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి.

–ఎం. శంకరయ్య, ఉపాధి కూలీ,కన్‌సాన్‌పల్లి

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వేసవికాలంలో ఉపాధి కూలీలు చేసిన పనుల్లో 25 నుంచి 30 శాతం వరకు 5 నెలల పాటు వేసవి భత్యం కేంద్రం చెల్లించేది. మూడేళ్లుగా వేసవి భత్యం రావడంలేదన్న మాట వాస్తవమే. ఉపాధి కూలీలకు అందించే వేసవి భత్యం విషయమై ప్రభుత్వానికి నివేదిస్తాం. ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో అన్ని సౌకర్యాలను కల్పిస్తూ కూలీలు పనులకు వచ్చేలా చేస్తున్నాం. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

– జ్యోతి, డీఆర్డీఏ పీడీ, సంగారెడ్డి జిల్లా

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): ప్రతి కాలనీలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి బీసీకాలనీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మంత్రి దామోదర సహకారంతో ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 10 కోట్ల నిధులు ఖర్చు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

చదువుపై దృష్టి పెట్టాలి



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): పిల్లలు చదువులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ భీమ్ సింగ్ సూచించారు. మంగళవారం మండలంలోని కంకోల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రూం టు రూం రీడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఓవర్ వ్యూ లిటరసి ప్రోగ్రాం, ఇన్‌స్ట్రక్షన్ ప్రోగ్రాం కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జాకీర్ హుసేన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారాం, ఆనందం, సత్తర్, ప్రధానోపాధ్యాయులు శైలజ, సురేందర్, సీఆర్పీ మనయ్య పాల్గొన్నారు.

ఈ చెత్త కంపు మాకొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఈ చెత్త కంపు మాకొద్దంటూ మండలంలోని ఎన్కేపల్లి ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. సదాశివపేట మున్సిపాలిటీలోని చెత్తను ఎన్కేపల్లి రోడ్డులోని డంపింగ్ యార్డులో డంప్ చేస్తుండటంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ఉమకు వినతిపత్రం అందజేశారు. దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురి కావడంతో పాటు.. చెరువులు కలుషితమవుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, నాయకులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మహిళా దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న ఆస్పత్రి మహిళా సిబ్బంది

హత్నూర (సంగారెడ్డి): మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మండల కేంద్రం హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రోజా రమణి హాజరై సిబ్బందితో కలిసి ఆస్పత్రిలో కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగంలో రాణించాలని వైద్యురాలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పురుషోత్తం, మహిళా సిబ్బంది ఉన్నారు.

31లోపు ఫీజు చెల్లించండి

హత్నూర(సంగారెడ్డి): ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 31లోపు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాలని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్ షేక్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించాలన్నారు. ఫీజులో ప్రభుత్వం 25% రాయితీ కల్పిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలన్నారు. మండలంలో 784 మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా 412 దరఖాస్తులు ఆమోదించారని చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని పస్తాపూర్ చౌరస్తాలో మంగళవారం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పస్తాపూర్ రోడ్డుపై వాహనచోదకులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి పట్టుపడిన ఐదుగురికి జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిశ్రమల సహకారంతో పాఠశాల అభివృద్ధి



శంకుస్థాపన చేస్తున్న శారద, రవీందర్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ న్యూలాండ్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి సమస్యను వివరించారు. వారు సానుకులంగా స్పందించిన రూ. 55 లక్షల నిధులు వెచ్చించి గదులు నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం శంకుస్థాపన చేశారు. నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. గతంలో పాఠశాల దూరంగా ఉండడంతో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు శారద, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం కల్హేర్ శివారులో నిర్వహిస్తున్న నీటి గుంటలు తవ్వకం పనులు పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల గురించి తెలుసుకున్నారు. కొలతల ప్రకారం డబ్బులు చెల్లించనున్నట్లు చెప్పారు.

జోరుగా ఉపాధి హామీ పనులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కంగ్టి గ్రామ శివారులో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. 600 మంది కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ ఆప్ ద్వారా పంపామని తెలిపారు. మండలంలోని చౌకన్‌పల్లి మినహ అన్ని గ్రామాల్లో 2269 మంది కూలీలు పనులు చేసినట్లు చెప్పారు. మండలంలో ఐదు టీంలు పనులను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

గుత్తులు గుత్తులుగా టామాట కాత

ధర లేక ఆపేసిన కోత



గుత్తులు గుత్తులుగా విరగకాసిన టామాట

జహీరాబాద్ టౌన్: టామాట ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లాభాలు వస్తాయని గంపెడు ఆశతో వేల రుపాయల ఖర్చుతో సాగు చేసిన టామాటకు గిట్టుబాటు ధరలేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదనందున అన్నదాత తీవ్ర ఆందోళనలో ఉన్నారు. జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో టామాట పంట వేశారు. పంట దిగుబడి గణనీయంగా ఉన్న ధరలేక రైతులు దిగాలు చెందుతున్నారు. పంట విరగకాసిన ధరలేకపోవడం వల్ల ప్రయోజనం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీదర్ పట్టణానికి చెందిన రాజు అనే రైతు హద్నూర్ గ్రామంలోని తన రెండు ఎకరాల పొలంలో టామాట సాగు చేశాడు. వేల రుపాయలు ఖర్చు చేయగా గుత్తులు గుత్తులుగా కాత కాసింది. కానీ, ధర లేకపోవడంతో కూలీ డబ్బులు కూడా రావడం లేదని పంట కోయడం ఆపేశాడు. ప్రతి రోజు కొంత పొలం వద్దే ఏరి పారేస్తున్నాడు.

ప్రతి ఏడాది జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించాలి

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: ఈపీఎఫ్ఓ పెన్షనర్లు, తమకు ప్రతి నెల పెన్షన్ రావాలంటే, ప్రతి ఏడాది కచ్చితంగా జీవిత ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవిత ధ్రువీకరణ పత్రాన్నే ×జీవన్ ప్రమాణ్ పత్రం॥ అని కూడా పిలుస్తారని అన్నారు. ఆన్‌లైన్‌లోనే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు కేంద్రం ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని తీసుకువచ్చిందని, దీని ద్వారా ఉన్న ప్రాంతం నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించుకోవచ్చని వివరించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కారించాలని పలు కాలనీవాసులు మంగళవారం జలమండలి ఎండీఅశోక్ రెడ్డి కలసి సమస్యను వివరించారు. పలువురు మాట్లాడుతూ.. తమ కాలనీలకు తాగునీరు అందించేందుకు డెవలప్‌మెంట్ చార్జీల కింద లక్షలాది రూపాయలు చెల్లించాలని షరతులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వివరించామని చెప్పారు. నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, మదన్‌మోహన్, అమిత్ చౌదరి, సంజీవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): లారీ కింద పడుకున్న ఓగుర్తు తెలియని వ్యక్తిపై నుంచి లారీపోవడంతో అతపే మృతి ఘటన తెల్లాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి తెల్లాపూర్‌లోని ఏలియన్స్ చౌరస్తా సమీపంలో రోడ్డుపై ఆగివున్న లారీ కింద పడుకున్నాడు. తెల్లవారుజామున డ్రైవర్ లారీ కింద పడుకున్న వ్యక్తిని గమనించకుండా లారీని తీశాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కేంద్రంలోని తాబేలుగుట్టపై నిర్మిస్తున్న జీవనజ్యోతిర్లింగ ఆలయ నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ నేత గోవర్ధన్‌రెడ్డి రూ.1.50 లక్షల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భోజిరెడ్డి, రాజేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రమేష్, ఫణిభూషణం, రాము తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా స్వయం పాలన దినోత్సవం**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని. అసద్‌గంజ్ మండల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు ఫర్హీన్ ఫాతిమా, సుమలత, సౌమ్య, స్వప్న విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **4వ వార్డులో శానిటరీ డ్రైవ్**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. స్థానికంగా నెలకొన్న అంతర్గత మురికి కాల్వల సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండిగూడెం వెళ్లే రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని పరిశీలించారు. చెత్తాచెదారాలను శుభ్రం చేయాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మాజీ కౌన్సిలర్ మృతి**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ కౌన్సిలర్ కోవూరి కృష్ణగౌడ్(60), అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో సోమవారం మృతి చెందాడు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు టీజీఐఐసీ వైస్ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, పట్టణంలోని నంబర్ వన్ గీతాపారిశ్రామిక సహకార సంస్థ అధ్యక్షుడు సీహెచ్. శ్రీనివాస్‌గౌడ్, తాజా మాజీ కౌన్సిలర్లు హాజరై నివాళులర్పించారు.

◆ **భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ కల్యాణం**

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ మమతాపెంటేష్, నారాబోయినకుమార్ దంపతుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. మేళతాళాల మధ్య ఎల్లమ్మ కల్యాణాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.

◆ **ప్రత్యేక పూజలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

◆ **నేడు ఇఫ్తార్ విందు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండలంలోని ఎస్ఎస్ పాటిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ కేధరినాథ్ పాటిల్ మంగళవారం తెలిపారు. సా. 6 గంటలకు ప్రారంభించే విందు కార్యక్రమానికి ముస్లిం సోదరులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

◆ **యువకుడిపై కత్తితో దాడి**

కల్హేర్(నారాయణఖేడ్): సంసారంలో గొడవలకు కారణమవుతున్నాడని యువకుడిపై కమ్మకత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వెంకటేశం తెలిపారు. మండలంలోని మార్డికు చెందిన శ్రీనివాస్‌పై గ్రామానికి చెందిన భద్రయ్య కత్తితో దాడి చేసి గాయపర్చాడు. శ్రీనివాస్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాలు ఆపేయాలని దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నారాయణఖేడ్: ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యే వరకు అన్ని రకాల ఉద్యోగ నియామకాలు నిలిపేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఖేడ్ డివిజన్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టం రాకముందే ఉద్యోగ నియామకాలు చేపడితే మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 20 వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మాదిగలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో పలువురు సంఘం నాయకుల పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



కలశాలతో మహిళల ఊరేగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధి కృష్ణనగర్ కాలనీలోని సంజీవని పర్వత ఆంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మందిరంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం మహిళలు108 కలశాలతో కాలనీ ప్రధాన రహదారుల గుండా ఊరేగింపుగా వెళ్లి హనుమాన్ విగ్రహానికి మంచినీటితో అభిషేకం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం, చందనం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

తడ్కల్ మండలం సాధించి తీరుతాం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జీఓ కాపీని చూపుతున్న భూపాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): తడ్కల్ మండల ఏర్పాటు కోసం కోర్టుకు వెళ్లైనా సాధించి తీరుతామని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం తడ్కల్‌లో నిర్వహించిన మహాధర్నాలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాము మండల ఏర్పాటుకు జీఓ ప్రకటించి మండలంగా ప్రకటించామన్నారు. ప్రక్రియ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గతంలో ధర్నాలో పాల్గొని మండలం కోసం దొంగ నాటకాలు చేసి ఓట్లు దండుకొన్నారని విమర్శించారు. అభ్యంతరం ప్రకటించిన మూడు గ్రామాలను వదిలి మిగతా గ్రామాలతో వెంటనే మండలం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండలం సాధించడానికి ఎమ్మెల్యే, ఎంపీ వద్దకు వెళ్లి సాధించి తీరుతానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే ఎస్.గంగారాం అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండరినాథ్‌రావు, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్, నాయకులు కోట ఆంజనేయులు, అహ్మద్, నారాయణ, శ్యాంరావు,వెవెంకట్‌రెడ్డి, సంతోష్‌పాటిల్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి



సంబరాల్లో పాల్గొన్న పాలక మండలి సభ్యులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తాయనున్నట్లు చైర్మన్ సాయి చరణ్ పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పాలక మండలి ఏర్పాటు అయి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ ప్రాంతంలో రాత్రి పూట చీకటిగా ఉంటుందని, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అభివృద్ధి పనులతో పాటు రైతుల సంక్షేమ కోసం కూడా కృషి చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు శంకర్‌పాటిల్, నరేష్‌గౌడ్,శేఖర్. వంశీ రాజ్, అఖిల్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతి పత్తి సాగుకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయికోడ్(అందోల్): అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగు చేస్తే మెరుగైన దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పత్తి సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సాధారణ పత్తి సాగు కంటే అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిలో సాగు చేస్తే ఎక్కువ దిగుబడి పొందవచ్చన్నారు. ఎకరా విస్తీర్ణంలో 22, 222 నుంచి 25,000 మొక్కలను పెంచవచ్చన్నారు. ఈ పద్ధతిలో తక్కువ పంట కాలంలో ఒకేసారి పూత, కాయలు రావడం వల్ల పంట తొందరగా చేతికి వస్తుందన్నారు. రైతులకు పత్తి పంటపై ఎక్కువ నష్టపరిచే గులాబీ రంగు కాయ తొల్చు పురుగు బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో రాయికోడ్ డివిజన్ ఏడీఏ సత్యానారాయణ, శాస్త్రవేతలు విజయలక్ష్మి, తబుస్సం ఫాతిమా, వ్యవసాయ అధికారులు సారిక, శ్రీనివాసరావు, రాయికోడ్ డివిజన్ వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై సర్వే



కుంటను సర్వే చేస్తున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధి బోరపట్ల గ్రామ శివారులోని ఓ పరిశ్రమ రెండు కుంటలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారన్న ఫిర్యాదుపై మంగళవారం నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. గ్రామ శివారులోని న్యారేటికుంట, కంసాని కుంటను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని గ్రామ బీజేపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు నీటిపారుదల శాఖ ఏఈఈ భూపుత్ర, రెవెన్యూ సర్వే శ్రీనివాస్ సర్వే చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహించి అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈఈ భూపుత్ర తెలిపారు. అధికారుల ఆదేశం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డికి ఘన స్వాగతం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి మొదటిసారి జహీరాబాద్‌కు వచ్చిన అంజరెడ్డికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనస్వాగతం పలికారు. పట్టణానికి సమీపంలో హుగ్గెల్లి వైజంక్షన్ వద్ద సన్మానం చేశారు. అక్కడి నుంచి పట్టణం వరకు భారీ మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ప్రధానకార్యదర్శి రాజశేఖర్, నియోజకవర్గం ఇన్‌చార్జి జగన్నాథ్, నాయకులు పాల్గొన్నారు.

చెరుకు మిషన్‌లో నలిగిన మహిళా చేతివేళ్లు



వేళ్లు నుంచి కారుతున్న రక్తం

సంగారెడ్డి జోన్: పట్టణంలోని జిల్లా కోర్టుకు ఎదురుగా గత కొన్ని రోజులుగా ఓ మహిళా బండి పై చెరుకు పాల వ్యాపారం చేసుకుంటుంది. మంగళవారం ప్రమాదవశాత్తు చెరుకు పాలు తీస్తున్న క్రమంలో చెరుకు పిప్పితో పాటు మిషన్‌లో చేయి పడి వేళ్లు నలిగిపోయి చెరుకు పాలధారతో పాటు ఆ మహి ళా వేళ్ల నుంచి రక్తధారలు కారాయి. అప్రమత్తమైన మహిళా విలవిల కొట్టుకుంటూ మరో చేతితో మిషన్ ఆఫ్ చేసుకుంది. అక్కడ ఉన్న వారు రెండు మ రల జాయింట్ నట్లును వి డదీసి ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.